RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 309 | 30 బుధవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఢిల్లీ రవాణా సౌకర్యాల విస్తరణకు రూ.1,941 కోట్ల ప్రాజెక్టులు

**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** దేశ రాజధాని ఢిల్లీలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రజలకు సులభమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రూ.1,941 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. అలాగే మరికొన్ని కీలక రవాణా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు ఢిల్లీ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజల ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయనున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూ.1,635 కోట్ల వ్యయంతో నిర్మించిన బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశను ప్రజలకు అంకితం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ ప్రాంతాల మధ్య సిగ్నల్ రహిత రాకపోకలు సాధ్యమవుతాయని అధికారులు తెలిపారు. నగరంలోని ప్రధాన మార్గాలపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు వేలాది మంది ప్రయాణికులకు సమయం ఆదా కానుంది.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన అమిత్ షా, దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు, వంతెనలు, రైల్వేలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఢిల్లీ వంటి మహానగరాల్లో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ పూర్తికావడంతో నగరంలోని పలు



ప్రాంతాల మధ్య ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గనుందని అధికారులు వివరించారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు ప్రతిరోజూ ఎదుర్కొనే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందన్నారు. ఇంధన వినియోగం తగ్గడంతో పాటు వాయు కాలుష్యాన్ని కూడా నియంత్రించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు.అదనంగా మోదీ మిల్--సావిత్రి సినిమా ఫ్లైఓవర్, లోనీ అండర్‌పాస్ నిర్మాణ పనులకు అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత నగరంలోని రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని చెప్పారు.

## డబుల్ ఇంజిన్ సర్కార్.. జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది



**రామాపురం, రాజధాని వాయిస్** కేంద్రం అండతో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా జరుగుతో ందని, డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నెల్లూరు జిల్లా రామాపురంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లతో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.“పల్లె పండుగ 3.0 కోసం రూ.11,085 కోట్ల నిధులు కేటాయిస్తున్నాం. మన పల్లెల్లో కొత్త వెలుగులు వస్తాయి. పవన్ కల్యాణ్.. గ్రామీణాభివృద్ధిశాఖలో అనేక మార్పులు తెచ్చారు. పంచాయతీరాజ్‌శాఖలో పలు కార్యక్రమాలు చేపట్టి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశాం. ఉదయగిరి నుంచి పల్లెల్లో నవోదయానికి నాంది పలికాం. గ్రామాల్లో పేదరికం తగ్గించేందుకు అనేక చర్యలు చేపట్టాం.ఉదయగిరి నియోజకవర్గం.. పండ్లతోటల హబ్‌గా మారుతుంది. రెండేళ్ల క్రితం ఉన్న పరిస్థితులు మీరంతా గుర్తుంచుకోవాలి. సూపర్‌సిక్స్ హామీలిచ్చి మాట నిలబెట్టుకున్నాం. అనేక కష్టాలున్నా తట్టుకుని పలు పథకాలు అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీశక్తి ద్వారా మహిళలకు అండగా నిలిచాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం. స్థానిక సంస్థల్లో మాకు అండగా నిలిచేందుకు మీరంతా సిద్ధంగా ఉన్నారు” అని సీఎం అన్నారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది: పవన్ కల్యాణ్



**రామాపురం, రాజధాని వాయిస్ :** నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ‘పల్లె పండుగ--3.0’ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రానున్న రోజుల్లో రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ‘పల్లె పండుగ--3.0’కు రూ.11,085 కోట్లతో పనులు చేపడుతున్నామని, ఇందులో కేంద్రం రూ.5,400 కోట్లు, రాష్ట్రం రూ.5,700 కోట్లు సమకూరుస్తున్నాయని వివరించారు. 6,000 కి.మీ. సీసీ రోడ్లు, 9,500 కి.మీ. బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, డ్రైన్లు, పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రజలు అభివృద్ధి పనులను పర్యవేక్షించి నాణ్యత, పారదర్శకతకు సహకరించాలని కోరారు. ఉదయగిరిలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయగిరి కోట అభివృద్ధికి రూ.2.5 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టి, హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని వెల్లడించారు.



**అమరావతి, రాజధాని వాయిస్ :** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలైన, అంతిమ లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి జగనేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఈడీ, సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదులుతున్నాయని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.“సొంత బాబాయ్ గొడ్డలిపోటు కు గురైతే గుండెపోటుగా నమ్మించి, సాక్ష్యాలను తుడిచిపెట్టిన చరిత్ర జగన్‌ది. ఇప్పుడు కూడా అదే తరహాలో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి, సునీల్ యాదవ్ వెల్లడించిన వాస్తవాలు, రూ.40 కోట్ల సుపారీ లావాదేవీలన్నీ తాడేపల్లి నివాసం వైపే వేలెత్తి చూపిస్తున్నాయి” అని అనగాని పేర్కొన్నారు. హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకోవ డంతోనే డీఎస్సీ వంటి అంశాలపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆరోపిం చారు.అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయుడు కాకుమాను రాజశేఖర్‌ను ధర్నాకు బలవంతంగా పిలిపించి, ఆయన మృతికి కారకులయ్యారని, ఇప్పుడు ఆ మరణంపై కూడా శవ రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సంస్కృతిని పెంచి పోషించిందని మండిపడ్డారు.తప్పులు చేస్తూ ఇతరులపై ఎదురుదాడికి దిగడం వైసీపీకి అలవాటుగా మారిందని, ఆ పార్టీ తన పేరును ‘గొడ్డలి డైవర్షన్ పార్టీ’గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ మీడియా ముందుకు వచ్చి వివేకా హత్యపై వాస్తవాలను వెల్లడించాలని అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను కూడా తమ ప్రభుత్వం పరిష్కరించి, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## సైబర్ స్టాకింగ్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

**తిరుపతి, రాజధాని వాయిస్** ఒకప్పుడు ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని.. ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ స్టాకింగ్ ఎక్కువవుతోందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ అన్నారు. సోషల్ మీడియా, ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా మహిళలను ఇబ్బంది పెట్టడం, వెంటపడటం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలో ‘స్టాకింగ్ నివారణ’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా మరో నంబర్ నుంచి పదేపదే కాల్స్, మెసేజ్‌లు చేయడం కూడా స్టాకింగ్‌లో భాగమేనన్నారు. అనుమతి లేకుండా గిఫ్ట్‌లు, బొకేలు పంపడం, మహిళల డీపీలు, ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని దుర్వినియోగం చేసి వేధించడం వంటి చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుని నిరంతరం సంప్రదించడం, వెంటపడటం వంటి ఘటనలను తొలిదశలోనే గుర్తించాలని సూచించారు.



## వైయస్ జగన్ ఒంగోలు పర్యటన



**ఒంగోలు, సెప్టెంబర్ 29 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఒంగోలులో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ దివంగత కాకుమాను రాజశేఖర్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న వైయస్ జగన్, ఈ విషాద సమయంలో పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒంగోలులోని క్లోపేట ప్రాంతంలో ఉన్న కాకుమాను రాజశేఖర్ నివాసానికి చేరుకున్న వైయస్ జగన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో సమావేశమైన ఆయన, కాకుమాను రాజశేఖర్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ లోటు కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరనిదని పేర్కొన్నారు.కాకుమాను రాజశేఖర్ పార్టీ కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా వైయస్ జగన్ గుర్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజల్లో పార్టీ విధానాలను తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. నిబద్ధత, అంకితభావంతో పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన వైయస్ జగన్, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటుందని, ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ వారికి ఓదార్పు కల్పించారు. కాకుమాను రాజశేఖర్ మృతి పార్టీ శ్రేణులను తీవ్రంగా కలచివేసిందని వైయస్ జగన్ పేర్కొన్నారు.

## ఈసీ, ఈవీఎంలపై నిందలేస్తారా?: బండి సంజయ్

### మోదీని ఎదుర్కోలేకే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్య



హైదరాబాద్: ప్రధాని మోదీని రాజకీయంగా ఎదుర్కోలేకే కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘం, ఈవీఎంలపై నిందలు వేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం సాధించినప్పుడు ఈవీఎంలపై ఎందుకు ప్రశ్నలు రాలేదని ఆయన నిలదీశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొత్తది కాదని, గతంలోనూ అమలైందని పేర్కొన్నారు. సవరణలో తప్పులు ఉంటే వాటిని సరిదిద్దుకునే వ్యవస్థ ఉందన్నారు. మోదీ ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించిన ఆయన.. వరుసగా మూడుసార్లు ప్రజలు గెలిపించినందుకా అని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఎవరు గెలవాలో ప్రజలే నిర్ణయిస్తారని, చట్టబద్ధమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్యంలో కీలకమని బండి సంజయ్ అన్నారు. సవరణ ప్రక్రియలో తప్పులున్నాయని భావిస్తే ఆధారాలతో బయటపెట్టాలని సవాల్ చేశారు.

## పోలీసులతో పాలన సాగిస్తున్నారు: బొత్స

**అమరావతి, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని నిరంకుశ పాలన సాగిస్తోందని వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. తమ డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని ఆయన ఖండించారు. ప్రజాస్వామ్యంలో తమ అభిప్రాయాలను, నిరసనను వ్యక్తం చేసే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయ ఉద్యోగుల ఆందోళనను అణచివేస్తున్నారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని, ఉన్నత చదువులు చదివిన వారికి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఉద్యోగాలు కల్పించిందని గుర్తుచేశారు. అలాగే, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు అరటి, బొప్పాయి, మొక్కజొన్న, వరి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## సచివాలయ ఉద్యోగులకు 15వేలకు పైగా ప్రమోషన్లు ఇచ్చాం: మంత్రి డోలా



**అమరావతి,రాజధాని వాయిస్** స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎటువంటి సర్వీస్ రూల్స్ లేకుండా 1.24 లక్షల మందిని నియమించి నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సచివాలయ వ్యవస్థను, ఉద్యోగుల సర్వీసులను స్ట్రీమ్‌లైన్ చేస్తున్నామని వెల్లడించారు. సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 15,000కు పైగా ప్రమోషన్లు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. 6 సంవత్సరాల స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌కు అనుమతి ఇచ్చామని.. దీనివల్ల ప్రభుత్వంపై రూ.150 కోట్ల ఆర్థిక భారం పడుతోందని చెప్పారు.ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (AAS), వేగవంతమైన క్యాజువల్ లీవ్ (CL) మంజూరు విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతినెల 2, 4వ బుధవారాల్లో డైరెక్టర్ స్థాయిలో, అలాగే జిల్లా స్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందించడమే జీవో 11 ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తున్నప్పటికీ ధర్నాలు చేయడం, అమానవీయంగా వ్యవహరించడం వెనుక ఉన్న శక్తులు ఎవరని ప్రశ్నించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ ప్రభుత్వ నిర్ణయాలను, పరిస్థితులను అర్థం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉందని తెలిపారు.ఉద్యోగులను రెచ్చగొడుతూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు కొందరు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలోనే ప్రమోషన్ ఛానల్స్, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు, సెలవుల సదుపాయాలు కల్పించామన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్, కేడర్ మార్పులపై గతంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోయారని ప్రశ్నించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ఇప్పటికే చర్చలు జరిపి పలు అంశాలను పరిష్కరించామని తెలిపారు. విపత్తులు, అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవ చేయడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని అన్నారు. విజయవాడ ధర్నా సందర్భంగా బందోబస్తులో ఉన్న సీఐ విధుల్లో చనిపోతే కడప జిల్లాకు చెందిన ఉద్యోగుల వాట్సాప్ అకౌంట్లో కొందరు మాట్లాడిన మాటలు అమానవీయంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆ వాట్సాప్ ఎకౌంట్ చాట్‌ను మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మీడియా ముందు ప్రదర్శించారు.

## కొత్త కానిస్టేబుళ్లకు మంత్రి పిలుపు

- ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలి
- నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి
- శాంతిభద్రతలతోనే రాష్టాభివృద్ధి సాధ్య
- మంత్రి అచ్చనాయుడు





**శ్రీకాకుళం, రాజధాని వాయిస్ సెప్టెంబర్ 29:** శ్రీకాకుళం రూరల్ మండలం తండ్యాంవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పది నెలలపాటు కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 142 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు మార్చ్‌పాస్ట్ గౌరవ వందనం స్వీకరించి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను అభినందించారు. ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న యువ పోలీసు సిబ్బంది తమ విధుల్లో నిబద్ధత, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని చట్ట పరిధిలో వాటికి తగిన పరిష్కారాలు చూపించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ సేవా దృక్పథంతో పనిచేస్తే పోలీసు వ్యవస్థకు మరింత గౌరవం లభిస్తుందని తెలిపారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రగతికి శాంతిభద్రతలే పునాది అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొన్నప్పుడే పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకా శాలు పెరుగుతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయపరమైన సమస్యలను అధిగమించి మహిళలతో సహా మొత్తం 5,800 పోలీసు ఉద్యోగాలను భర్తీ చేసి రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. ప్రస్తుత బ్యాచ్ శిక్షణ పూర్తికాకముందే మరో 1,156 పోలీసు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పోలీసు నియామకాలు చేపట్టి నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. రాష్ట్ర భద్రతను బలోపేతం చేయడంతో పాటు యువతకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. నేరాల నియంత్రణ, వేగవంతమైన సేవలందింపు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, రహదారి భద్రత వంటి అంశాల్లో పోలీసులు మరింత చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ప్రజల భద్రతే తమ ప్రధాన బాధ్యత అనే భావనతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల తుఫాన్ల సమయంలో శ్రీకాకుళం జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో పోలీసు శాఖ అందించిన సహాయక చర్యలను మంత్రి అభినందించారు. కవాతు, శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు. తమ పిల్లలను ప్రజాసేవకు అంకితం చేసిన తల్లిదండ్రులను అభినందిస్తూ, శిక్షణ సిబ్బంది కృషిని కూడా కొనియాడారు.

# గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది







**ఉదయగిరి, రాజధాని వాయిస్** గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది అని, ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా ప్రతి గ్రామాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించిన పల్లె పండుగ--3 కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్న ఆయన, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. రహదారులు, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, పర్యాటకం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో గ్రామీణాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమాలు, జలధార పథకాలు, ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పంచాయతీ వ్యవస్థ బలోపేతం వంటి చర్యలతో గ్రామాలకు కొత్త ఊపు తీసుకొచ్చామని చెప్పారు. ఒకప్పుడు కనీస అవసరాల కోసం కూడా నిధులు లేని పంచాయతీలు, ఇప్పుడు తమ అభివృద్ధి ప్రణాళికలను తామే రూపొందించుకునే స్థాయికి చేరుకున్నాయని వివరించారు.గత ఐదేళ్లలో జరిగిన పనులతో పోలిస్తే కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే గ్రామీణ రహదారుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నీటి కుంటలు, మినీ గోకులాలు, పండ్ల తోటల అభివృద్ధి వంటి కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో కూడా రహదారి అనుసంధానానికి ప్రాధాన్యత ఇస్తూ వందలాది గ్రామాలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పల్లె పండుగ--3 కింద రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. వేల కిలోమీటర్ల సీసీ, బీటీ రహదారులతో పాటు మినీ గోకులాలు, ఉద్యానవనాల అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థలు, గ్రామ పంచాయతీ భవనాలు, ప్రజా సదుపాయాల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని డొంక రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

పంటలను మార్కెట్‌కు తరలించడంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రతి నియోజకవర్గంలో నమూనా ప్రాజెక్టుగా రహదారుల అభివృద్ధి చేపట్టి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రవాణా సదుపాయాలు కీలకమని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని, ఎక్కడైనా లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు భాగస్వాములైతేనే గ్రామాల అభివృద్ధి మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. పల్లె పండుగ--3 గ్రామీణ ప్రగతికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతు బజార్లలో కిలో రూ.35కే ఉల్లి

**అమరావతి, రాజధాని వాయిస్** రైతు బజార్లలో ఉల్లిపాయ లను కిలో రూ.35కే విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ంది. ధరల స్థిరీకరణలో భాగంగా రేపటి నుంచి తొలి దశలో విజయవాడలోని అన్ని రైతు బజార్లలో సబ్సిడీ ధరకు ఉల్లిపాయలు అందుబాటులోకి రానున్నాయి. ఆధార్ లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు రెండు కేజీల చొప్పున ఉల్లిపాయలను విక్రయించనున్నారు. ప్రజల డిమాండ్‌ను బట్టి ఈ సబ్సిడీ విక్రయాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉల్లిపాయల ధరల భారాన్ని తగ్గించడమే లక్ష్యమని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రూ.11,085 కోట్లతో పల్లె పండుగ 3.0.. ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ హర్షం..

**అమరావతి, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధా న్యం ఇస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రూ.11,085 కోట్లతో చేపట్టనున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం కావడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన పేర్కొన్నారు.పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సర్వతోముఖ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. డిప్యూటీ సీఎం ఆలోచన, కార్యాచరణతో పల్లెలు ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, గ్రామీణ మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో పల్లె పండుగ కార్యక్రమం కీలకంగా ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. రూ.11,085 కోట్ల భారీ వ్యయంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

## జమ్మూ కశ్మీర్ జలవిద్యుత్ విధానంపై సమీక్ష

- విద్యుత్ ఉత్పత్తి సామర్థ్య పెంపుపై దృష్టి
- జలవిద్యుత్ వనరుల వినియోగానికి ప్రాధాన్యం
- ప్రాంతీయ అభివృద్ధే ప్రధాన లక్ష్యం




**శ్రీనగర్, రాజధాని వాయిస్ :** జమ్మూ కశ్మీర్ జలవిద్యుత్ విధానం--2026 ముసాయిదాపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం పనితీరును పరిశీలించిన అనంతరం కొత్త విధానంలో జమ్మూ కశ్మీర్‌లోని జలవిద్యుత్ సామర్థ్యాన్ని వేగంగా వినియోగించుకునేలా చర్యలు ఉండాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడం కొత్త విధానంలోని ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సహజ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ విద్యుత్ ఉత్పత్తిని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.జలవిద్యుత్ వనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్ అవసరాలకు కూడా భరోసా కల్పించే విధంగా విధానం రూపొందించాలని సూచించారు. విద్యుత్ భద్రతను పెంపొందించడంతో పాటు స్థిరమైన అభివృద్ధికి దోహదపడే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. జలవిద్యుత్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా, మౌలిక వసతులను అభివృద్ధి చేసేలా విధానం ఉండాలని సమావేశంలో చర్చించారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.జమ్మూ కశ్మీర్‌లో ఉన్న జలవిద్యుత్ వనరులను సుస్థిర పద్ధతిలో అభివృద్ధి చేయడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకృతి సంపదను పరిరక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. శక్తి భద్రత, ఆర్థిక వృద్ధి, ప్రాంతీయ సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కొత్త జలవిద్యుత్ విధానం దోహదపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రజల అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

## పల్లె పండుగ-3కు శ్రీకారం చుట్టిన ఎన్డీయే ప్రభుత్వం



**ఉదయగిరి, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.11,085 కోట్లతో పలు పనులను ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. గ్రామాల రూపురేఖలు మార్చే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రజలు 2024 ఎన్నికల్లో వ్యక్తం చేసిన విశ్వాసానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. తన అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణం వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.పల్లె పండుగ-3 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అదనంగా రూ.2,700 కోట్లతో మరో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ పనితీరును ప్రస్తావిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో శాఖ విశేష ఫలితాలు సాధించిందని చంద్రబాబు తెలిపారు. నిలిచిపోయిన నిధుల విడుదల, ఉద్యోగులకు పదోన్నతులు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతంతో గ్రామీణ పరిపాలన మరింత మెరుగుపడుతోందని అభిప్రాయపడ్డారు.ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించి పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రకటించారు. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు, పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

# మహిళలకు పోలీసుల అవగాహన సదస్సు!



**గుంటూరు,రాజధాని వాయిస్ :** మాదక ద్రవ్యాల వినియో గం, మహిళలు మరియు పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు పోలీసులు అవగాహన కల్పించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రామిరెడ్డి తోటలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట సీఐ విరయ్య చౌదరి మహిళలకు పలు సూచనలు చేశారు.మహిళలపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే కఠినమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

**పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి**

పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మగ పిల్లలు, ఆడ పిల్లలు అనే తేడా లేకుండా పిల్లలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వారి ప్రవర్తన, స్నేహాలు, ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని సూచించారు.ప్రస్తుతం కొంతమంది పిల్లలు సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చెడు సావాసాలకు అలవాటు పడుతున్నారని, అందువల్ల పిల్లలను ఫోన్లకు వీలైనంత దూరంగా ఉంచాలని సూచించారు.

**గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలి**

తమ ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల సహాయం కోసం 181, 1091, పిల్లల కోసం 1098 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.అలాగే తమ ప్రాంతాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా వెంటనే కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.ప్రజల సహకారంతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంతో పాటు మహిళలు, పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని సీఐ విరయ్య చౌదరి తెలిపారు.

# వారం రోజుల్లో జీఎంసీ షాపుల వేలం: కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు నగరంలో ఖాళీగా ఉన్న నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ లకు వారం రోజుల్లోగా వేలం నిర్వహించి, షాపులను కేటాయించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అధికారులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం నందు తొలుత ఆర్ఐ ల వారీగా రెవిన్యూ, వివిల్టీ కలెక్షన్ల వివరాలను అడిగి తెలుసుకొని, కలెక్షన్లు తక్కువగా ఉన్న ఆర్ఐ లు కలెక్షన్లు పెంచాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రెవిన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుండి వచ్చే సర్వీస్ రిక్వెస్ట్ లు (మ్యుటేషన్, న్యూ టాక్స్, వివిల్టీ) వంటి వాటిని ఎటువంటి ఆలస్యం లేకుండా నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. రెవిన్యూ సేవల్లో జాప్యం వహిస్తే అందుకు బాధ్యులైన వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వీస్ రిక్వస్ట్ ల పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ ఎక్కువ ఉండడం, విధుల్లో నిర్లక్ష్య వైఖరిపై వార్డ్ సచివాలయం నం.3 బిల్ కలెక్టర్ పద్మావతి, వార్డ్ సచివాలయం 17 రెవెన్యూ కార్యదర్శి సుందర్ సింగ్ లను సస్పెండ్ చేసి, చార్జెస్ ఫ్రేం చేసి, వారిపై ఎంక్వయిరీ నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.నగర పాలక సంస్థ షాప్ ల బకాయిలను కూడా నూరు శాతం వసూలు చేయాలని, లీజు ముగిసిన షాప్ లకు ఎటువంటి ఆలస్యం లేకుండా వారం రోజులలోపు ఆక్షన్ నిర్వహించి షాపులను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ షాపుల ఆక్షన్లు నిర్వహించుటలో జాప్యం జరిగితే దానికి ఆర్ఓ లు ఆర్ఐ బాధ్యవహించాలన్నారు.ముఖ్యంగా రెవిన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుండి వచ్చే పిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, రెవిన్యూ సేవలకు సబంధించి ప్రజల నుండి వచ్చే పిర్యాదులు మరియు సేవలను ఎటువంటి కారణం లేకుండా రిజెక్ట్ చేస్తే సంబంధిత రెవిన్యూ ఇన్స్పెక్టర్ పై చర్యలు తీసుకొనుట జరుగుతుందని ఆర్.ఐ లను హెచ్చరించారు. నగరంలో నూతన టాక్స్ లు విధించాల్సిన అపార్ట్మెంట్లు, లే అవుట్లకు అన్నిటికి నిబంధనల ప్రకారం టాక్స్ విధించాలని, వాటిలో ఎటువంటి తప్పులు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, జి.సాంబశివరావు, సూపరింటెండెంట్ రవికిరణ్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కిట్స్‌లో 'యువత భవితకు భరోసా' సదస్సు.. ఎంపీ రామకృష్ణ




**గుంటూరు, రాజధాని వాయిస్ :** స్థానిక గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలంలో వింజనంపాడు:దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే శక్తి యువతకే ఉందని అని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ అన్నారు. స్థానిక వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్ ) కళాశాలలో విద్యార్థుల కోసం యువత భవితకు భరోసా' మోటివేషనల్ అవేర్‌నెస్ సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ భాష్యం రామకృష్ణ గారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా నైపుణ్యాలను పెంపొందించుకుని నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏర్పాటవుతున్న పరిశ్రమలు, భవిష్యత్తులో రానున్న పరిశ్రమల ద్వారా యువతకు లభించనున్న అవకాశాలను వివరించారు.ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బుర్లా రామాంజనేయులు గారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. నూతన పారిశ్రామిక విధానాల ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని, అమరావతి రాజధాని నిర్మాణం పునఃప్రారంభంతో భవిష్యత్తులో యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పెట్టుబడులను ఆకర్షిస్తూ 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు , కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి వారిని గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, అధ్యాపకులు, కూటమి నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 2,000 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలి: గుంటూరు కలెక్టర్



**గుంటూరు, రాజధాని వాయిస్ :** తెనాలి మండలం బుర్రిపాలెంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులకు అక్టోబర్ 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, కేంద్రకమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ పాల్గొననున్నారని చెప్పారు. హెలిపాడ్ ఏర్పాట్లు, రహదారి మరమ్మతులు, వేదిక నిర్మాణం తదితర అంశాలను పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి,రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా-గుంటూరు టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల



**గుంటూరు, రాజధాని వాయిస్ :** కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గాని కి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా షెడ్యూల్ విడుదల చేశారని, 01.11.2026 ని అర్హత తేదీగా గత 6 కాలంలో కనీసం మూడేళ్లు పూర్తికాలం ఉపాధ్యాయుడిగా బోధించిన అనుభవం ఉండి, ప్రభుత్వ గుర్తింపు పొందిన సెకండరీ లేదా అంతకంటే ఎక్కువ స్థాయి విద్యాసంస్థల్లో పనిచేస్తున్నవారు.ఈ ఓటు హక్కు నమోదుకు అర్హులని, గతంలో ఓటు ఉన్నవారు కూడా తప్పనిసరిగా కొత్తగా ఫారమ్-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీ ఓట్ల నమోదు, స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో అధికారులతో సమావే శం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సంబంధిత సర్వీస్ సర్టిఫికేట్‌తో జతచేసి నవంబర్ 6 నాటికి అందించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను పరిశీలించి నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాలు లేదా క్లెయిమ్‌లను నవంబర్ 25నుండి డిశంబర్ 10 వరకు స్వీకరిస్తారన్నారు.అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించి, తుది ఓటర్ల జాబితాను డిశంబర్ 30న అధికారికంగా ప్రచురిస్తాని తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓటర్ల నమోదుకు విద్యా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతూ, జోనల్ అధికారులు, ఎంసిసి టీం, పోలింగ్ పర్సన్స్ నియామకంపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్లు, అదనపు కమిషనర్ ని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మెటీరియల్ ని అందించడానికి టెండర్స్ పిలవాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని ఎస్ఈ ని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటుపై పరిశీలించిన కేంద్రాల మ్యాప్ లను సిద్దం చేయాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అధికారులు, శాఖల మధ్య సమన్వయం కీలకమని, ప్రతి ఒక్కరూ కేటాయించిన విధుల్లో అంకిత భావంతో ఉండాలన్నారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# గుంటూరు ఎకో పార్క్‌లో మొక్కల సంరక్షణ: చేయూత ఫౌండేషన్




**గుంటూరు, రాజధాని వాయిస్** గుంటూరు నగరంలో ఎకో పార్క్ లో నాటిన వెయ్యి మొక్కలను సంరక్షించే బాధ్యతను చేయూ త ఫౌండేషన్ చేపట్టి ఈనెల 29వ తేదీన గుంటూరులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మరియు టిజెపిఎస్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని చేయూత ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మరియు సౌత్ కోస్టల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎస్. మంజునాథ్ నేతృత్వంలో జరిగింది.ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ప్రపంచ వ్యాప్తంగా సగటున ఒక్కొక్కరికి 422 చెట్లు ఉండగా ఇండియాలో 28 చెట్లు మాత్రమే ఉన్నాయని కెనడాలో 8953 చెట్లు, రష్యాలో 4461 చెట్లు, ఆస్ట్రేలియాలో 3266 చెట్లతో అగ్రభాగాన ఉన్నాయని ఈజిప్ట్, ఖదర్, ఉమెన్, మొనాకో లాంటి దేశాలలో ఒక చెట్టు లోపు మాత్రమే ఉంటూ అత్యల్ప స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రపంచ భూభాగంలో 31 శాతం అడవులు ఉండగా ఇండియాలో 25 శాతం, ఆంధ్రప్రదేశ్ 18 శాతం గా ఉంటే గుంటూరు జిల్లాలో కేవలం 7 శాతంతో అతి తక్కువ స్థాయిలో ఉందన్నారు. ప్రపంచంలో ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో కోట్లాది మొక్కలు నాటి సంరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.పట్టణీకరణ, రోడ్ల విస్తరణ, మైనింగ్, జనాభా పెరుగుదల లాంటి కారణాలతో చెట్లు నరికివేత పెరుగుతుందని మనదేశంలో 500 కోట్ల చెట్లను పెంచితే గాని పర్యావరణాన్ని కాపాడుకోలేమన్నారు. గత 80 సంవత్సరాలలో నాటిన కోట్లాది మొక్కలలో కేవలం రెండు శాతం మాత్రమే మొక్కలను సంరక్షించి చెట్లగా పెంచగలిగామన్నారు. సౌత్ కోస్టల్ రైల్వేస్ మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎస్. మంజునాథ్ ప్రసంగిస్తూ నెలరోజుల క్రితం ఎకో పార్కులో నాటిన వేయి మొక్కల్లో కేవలం ఒక శాతం మాత్రమే చనిపోయాయని తెలిపారు.ప్రముఖ సేవా తత్పరులు రేమాండ్స్ అధినేత త్రిపుర మల్లు అరుణ్ కుమార్ ఉచితంగా అందించిన ట్యాంకర్ తో మొక్కలకు నిరంతరం నీరు అందిస్తున్నామని వివరించారు. బహుముఖ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోవిడ్ ఫైటర్స్ మొక్కలకు నిరంతరం నీరు అందించే బాధ్యతను స్వీకరించడం అభినందనీయమన్నారు. టిజెపిఎస్ మరియు హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలకు నీరు సమృద్ధిగా అందించడానికి పాదులు చేసి వాటికి చేయూత నివ్వడానికి కర్రలు ఉంచటం ,చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటడం లాంటి కార్యక్రమాలను జయ ప్రదంగా నిర్వహించి పని సంస్కృతికి నిదర్శనంగా నిలిచినారన్నారు. ఈ కార్యక్రమంలో టిజెపిఎస్ కళాశాల అధ్యాపకులు గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డా॥ జె.వి. సుధీర్ కుమార్, హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బొందిలి పవన్ సాయి రామ్ సింగ్, ల్యాబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ షేక్ ఖాదర్ బాషా, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు షేక్ పఠాన్ అల్లాబక్షు, మానవత అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి, సభ్యులు టి.వి. సాయిరాం, మేకల రామారావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, కెబిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలరాజు, ప్రముఖ ప్రజా గాయకులు పి.వి. రమణ, పవన్ జోవిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు పవన్, చేయూత ఫౌండేషన్ సభ్యులు టి. ధనుంజయ రెడ్డి, మాదిగ జన సేవా సమితి నేత పుసులూరి విజయ్, రైల్వే చీఫ్ డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ వంక రామశేషారెడ్డి మొక్కల సంరక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన సదుపాయం ప్రముఖ వ్యాపారవేత్త వణుకూరి సుబ్బారెడ్డి కల్పించినారు.

# కృష్ణా కరకట్ట నివాసితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



**విజయవాడ, రాజధాని వాయిస్** ప్రభుత్వం పేదలకు పట్టాల పండుగ, పట్టాభిషేకం అని హడావిడి చేస్తున్నారు. కానీ కృష్ణా కరకట్టపై ఉన్న ప్రజలు ఎన్నొ ఆశలతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిం చారు. ఎన్నికల్లో గెలిపిస్తే పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఈ ప్రాంత ఇళ్ళకు పట్టాలు లేవు, ఇళ్ళపై హక్కు లేదు. ప్రతి సంవత్సరం వరదల్లో ఇళ్ళు మునిగిపోయి, ఇళ్ళు దెబ్బతిని సామాన్లు కోల్పోయినా పొట్ట చేతపట్టుకుని పనుల కోసం కట్టలపైనే నివాసం ఉన్నారు. వరదల్లో రూపాయి ఆర్థిక సహాయం కూడా ప్రభుత్వం చేయలేదు. దెబ్బతిన్న ఇళ్ళ పునర్నిర్మాణానికి అప్పులు చేసుకుని కట్టుకున్నారు.ఒకప్పుడు తెలుగు దేశంతో పాటు అధికారంలో ఉన్న అన్ని ప్రభుత్వాలు వీరిని ఎలా తొలగించాలా అని చూసారు. సిపిఎం, జనం పోరాటాలతోనే ఈ ప్రాంత ఇళ్ళ తొలగింపు ఆగింది. ప్రజాపోరాటాల వలన ఈ ప్రాంతంలో ఇళ్ళు నిలబడ్డాయి.కృష్ణా నదిపై రక్షణగోడ (రిటైనింగ్‌వాల్) నిర్మాణం చేపట్టాలని అడిగితే కమ్యూనిస్టులు, జనం పోట్లాడితే నదిలో గోడ సాధ్యం ఎలా అవుతుంది అన్నారు. ఈ రోజు గోడ నిర్మాణం పూర్తయ్యింది. ఇది మీ గొప్పతనం కాదు ప్రజలు, కమ్యూనిస్టులు సిపిఎం పోరాట ఫలితం.గోడ కట్టారు, వరద ముంపు లేదు, అయినా ఈ ప్రాంత ఇళ్ళకు పట్టాలు ఇవ్వడం కుదరదు అంటున్నారు. మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగుల రోడ్డు వేస్తామంటున్నారు. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి గోడ నిర్మాణం చేసింది వరదల నుండి ప్రజలను కాపాడడానికా? ఇళ్ళు తొలగించి రోడ్లు వేసుకోవడానికా?ఉండవల్లిలో కృష్ణా కరకట్ట పక్కన పెద్ద పెద్ద నాయకులు, కోటీశ్వరులు పెద్ద భవంతులు, విశ్రాంతి భవనాలు, ప్యాలెస్‌లు కట్టుకుంటే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. 50 సంవత్సరాలుగా తాటాకులు, రేకుల షెడ్డులో ఎండలకు మాడిపోతున్నాం అప్పు చేసి కప్పు మార్చుకుంటాం అంటే వారికి ఎందుకు అనుమతి ఇవ్వరు. పట్టాలు ఇచ్చి వారికి ఇంటిపై వారికి శాశ్వత హక్కు కల్పించడానకి అభ్యంతరం ఏంటి.కృష్ణా నది ప్రక్కన పెద్దపెద్ద బంగ్లాలు ఉన్నాయి. పదిహేను సంవత్సరాల క్రితం వచ్చిన ముఖ్యమంత్రి గారి ఇళ్ళు కూడా నది ఒడ్డునే ఉన్నది. దానికి పట్టా ఉంది కానీ 50 ఏళ్ళుగా ఉంటున్న ప్రజలకు పట్టాలు ఇవ్వడం లేదు. కాలువ కట్టలపై స్థలాలో పెద్ద భవంతులు నిర్మిచుకోవడానికి అనుమతులు ఇస్తున్నారు. కానీ పేద వాళ్ళ ఇళ్ళ విషయంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది.టిడిపి ప్రజాప్రతినిధులు.. పట్టాల సభకు రావాలని బొట్టు పెట్టి మరీ ఆహ్వానిస్తున్నారు. ఏళ్ళ తరబడి కృష్ణా కరకట్ట ప్రజలతో ఓట్లు వేయించుకుంటున్నారు. తారకరామానగర్, భూపేష్‌గుప్తా నగర్, కృష్ణా కరకట్ట ప్రజలు వారికి గుర్తు రావడంలేదా? ముఖ్యమంత్రితో మాట్లాడి పట్టాలు ఇప్పించలేరా? కృష్ణా కరకట్ట ప్రజలకు వారి ఇళ్ళకు శాశ్వత హక్కు కల్పించాలని, రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చి, ఇతరులకు ఇచ్చినట్లే 5లక్షల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నాము. ఎన్నో యేళ్ళుగా ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజా ప్రతినిధులుగా ఎన్నేళ్ళు పనిచేసినా కృష్ణా కరకట్ట ప్రజల సమస్య పరిష్కారం చేయలేదు. అందుకే కృష్ణా కరకట్ట ప్రజల ఇళ్ళకు పట్టాలు ఇవ్వాలి. పట్టాలు సాధించుకునేంత వరకు ప్రజలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తాం.ఈ కార్యక్రమంలో తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు తమ్మిన చంద్రశేఖర్, స్థానిక నాయకులు వరప్రసాద్, వై. కృష్ణ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

**మండల విద్యాశాఖాధికారి ఎండి.ఖాసీం**



**పిడుగురాళ్ల.సెప్టెంబర్ 29,రాజధాని వాయిస్:** మండలంలోన 47 మండల ప్రాథమిక పాఠశాలలు,రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, రెండు ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, ఒక ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మొత్తము మండలంలోని 63 పాఠశాలలలో పాఠశాలలో యాజమాన్యకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎండీ ఖాసిం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి సహకరించిన గ్రామ పెద్దలకు, తల్లిదండ్రులకు, పోలీస్ సిబ్బందికి, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు,ఎం ఆర్ సి సిబ్బందికి మండల విద్యాశాఖ తరపున ధన్యవాదములు తెలియజేశారు.మండల విద్యాశాఖ అధికారి బ్రాహ్మణపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి ఆ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మనగా ఎన్నికైన రామకృష్ణ, వైస్ చైర్మన్ ఆదిలక్ష్మి లను సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్య కమిటీ పాఠశాల అభివృద్ధి కృషి చేయాలని, విద్యార్థులందరూ పాఠశాలకు రెగ్యులర్గా హాజరయ్యే విధంగా తల్లిదండ్రులలో చైతన్యం తేవాలని, తమ క్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న విద్యార్థులందరిని ప్రభుత్వ పాఠశాలో చేర్పించాలని, ప్రభుత్వమందిస్తున్న పథకాలన్నీ అందరికీ చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సీనియర్ సిఆర్పిలూ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బస్తాకి క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసివేయాలి

**తహసీల్దార్ కి వినతి పత్రం సమర్పించిన రేషన్ డీలర్లు**



**కారంపూడి.సెప్టెంబర్ 29రాజదాని వాయిస్ :**కారంపూడి డీలర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో వెంకటేశ్వర్లు నాయక్ కి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా ప్రభుత్వం ఈ మధ్యకాలంలో తీసుకువచ్చిన ప్రతి రేషన్ బస్తా కి క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసేయాలని అలాగే ప్రభుత్వం గతంలో ఇచ్చే రూపాయి కమిషన్ని మూడు రూపాయల వరకు పెంచాలని, డీలర్స్ని ఆదుకోవాలని మరికొన్ని సమస్యలపై కారంపూడి ఎమ్మార్వోకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డీలర్షిప్ అసోసియేషన్ సభ్యులు మరియు పట్టణ మరియు మండల పరిధిలోని డీలర్లు పాల్గొన్నారు.

# న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం

**- 214 మంది విద్యార్థుల రక్తదానం**




**మాచర్ల.సెప్టెంబర్ 29 రాజధాని వాయిస్ :** మండలంలోని అలుగురాజుపల్లి సమీపంలోని న్యూటన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల, గుంటూరు తలసేమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాలకు చెందిన 214 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు నిర్వాహకులు పండ్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన లయన్స్ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ ఎన్. గోపీచందు, మాజీ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, తలసేమియా బ్లడ్ సెంటర్ ప్రతినిధి శివాజీ మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న ఎందరో బాధితులకు ఇది పునర్జన్మనిస్తుందని కొనియాడారు. ఇంత పెద్ద సంఖ్యలో యువత ముందుకు వచ్చి సేవాభావాన్ని చాటడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జున్నా శ్రీనివాసరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ జున్నా చక్రధర్ రెడ్డి, డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి, మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చారి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ బి. నరసింహారావు, ఏవో ఖాసిం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులను అభినందించారు.

# మాచర్లకు చెందిన వ్యక్తి హైదరాబాద్లో అదృశ్యం

**ఎంజీబీఎస్ వద్ద చివరిసారిగా గుర్తింపు**
**ఆచూకీ తెలిపితే రూ.50 వేల నగదు బహుమతి**



**మాచర్ల.సెప్టెంబర్ 29 రాజధాని వాయిస్ :**పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మీనుగ శ్రీనివాసరెడ్డి (52) హైదరాబాద్లో అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 18న సాయంత్రం 4 గంటల సమయంలో హైదరాబాద్లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) వద్ద ఆయన కనిపించకుండా పోయినట్లు పేర్కొన్నారు.అదృశ్యమైన సమయంలో శ్రీనివాసరెడ్డి తెల్లటి చొక్కా, నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా గాలిస్తున్నా ఆచూకీ లభించలేదు. ఆయన ఆచూకీ తెలిపిన వారికి కుటుంబ సభ్యులు రూ.50 వేలు నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. సమాచారం తెలిసిన వారు కొత్తపల్లి గ్రామం, మాచర్ల మండలం లేదా 62814 33194, 83740 69939 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు భద్రత దుర్గి ఎస్సై బి. గోపాల్



**దుర్గి.సెప్టెంబర్ 29 రాజధాని వాయిస్ :** పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహాల్లి ఆదేశాల మేరకు దుర్గి మెయిన్ సెంటర్లో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. గోపాల్ మాట్లాడుతూ, ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఆర్సీ వంటి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేగ నియంత్రణ పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఆయన తెలిపారు.

## బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భీమవరపు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్గా బత్తుల బాబూరావు ఏకగ్రీవ ఎన్నిక



**మాచర్ల.సెప్టెంబర్ 29రాజధాని వాయిస్ :**బీసీ సంక్షేమ సంఘం మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా భీమవరపు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్గా బత్తుల బాబూరావు (వకీల్ సాబ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వీరితో పాటు జిల్లా కార్యదర్శిగా భీమవరపు శ్రీనివాసరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలిగా పగడాల విజయలక్ష్మిలను నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జింకల నాగేశ్వరరావు ప్రతిపాదించిన ఈ నియామకాలను రాష్ట్ర కార్యదర్శి బృంగా రమణారావు బలపరచగా, పల్నాడు జిల్లా అధ్యక్షుడు బిళ్ళకంటి శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు ఆమోదముద్ర వేశారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ బీసీ హక్కుల పరిరక్షణతో పాటు బీసీ చట్టం, రాజకీయ రిజర్వేషన్ల సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్, బాబూరావులను నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కదం నాగజ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి బాదంభాయి, మండల అధ్యక్షుడు వెంకట్రామయ్య, పట్టణ అధ్యక్షుడు పోతులూరి పిచ్చయ్య, నాయకులు గోలి శ్రీనివాసరావు, శ్యామసుందరాచారి పాల్గొన్నారు.

# అచ్చెన్నాయుడుపై తిలక్ విమర్శలు



**టెక్కలి,రాజధాని వాయిస్ సెప్టెంబర్ 29 :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. వైయస్ఆర్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జి పేరాడ తిలక్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టెక్కలి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తిలక్ మాట్లాడుతూ సీతాపురం గ్రామానికి చెందిన మహిళలను సమావేశం ఉందని చెప్పి మరో ప్రాంతానికి తీసుకెళ్లి కండువాలు కప్పారని ఆరోపించారు. ఈ ఘటనపై కొందరు మహిళలు తమను మాయమాటలతో తీసుకెళ్లారని చెప్పినట్లు తిలక్ వెల్లడించారు. తాము వైయస్ఆర్ సీపీతోనే కొనసాగుతున్నామని వారు స్పష్టం చేసినట్లు తెలిపారు. సీతాపురం గ్రామంలో కుటుంబాల సంఖ్యకు సంబంధించి కూడా తిలక్ ప్రశ్నలు లేవనెత్తారు. గ్రామంలో ఉన్న కుటుంబాల సంఖ్య కంటే ఎక్కువ మందిని చూపిస్తూ రాజకీయ ప్రచారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను మళ్లించేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పింఛన్ల అంశంపై కూడా తిలక్ ప్రభుత్వాన్ని విమర్శించారు. రెండున్నరేళ్ల కాలంలో అర్హులైన అందరికీ ప్రయోజనాలు అందించడంలో వైఫల్యం కనిపించిందని ఆరోపించారు. పింఛన్ల పంపిణీ పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.అయితే ఈ ఆరోపణలపై మంత్రి అచ్చెన్నాయుడు లేదా తెలుగుదేశం పార్టీ నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో రాజకీయ చర్చలు మరింత వేడెక్కుతున్నాయి. ఈ విలేకరుల సమావేశంలో టెక్కలి జడ్పీటీసీ సభ్యులు దువ్వాడ వాణి, పార్టీ నాయకులు సత్తారు సత్యం, తమన్న కిరణ్, కిల్లి అజయ్ కుమార్, బెండి ఉదయ్, కర్ణిక జీవన్ రావు, బర్ల కార్తీక్, బడ్డ రాజేష్తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు వైయస్ఆర్ సీపీ సమాయత్తం

**- ఉమ్మడి కర్నూలు జిల్లా నేతల కీలక సమావేశం**
**- పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేసిన నేతలు**
**- ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి**



**కర్నూలు, రాజధాని వాయిస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల కీలక సమావేశం కర్నూలు నగరంలో నిర్వహించారు. పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు మరియు కార్యకర్తల సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ బలంగా పోటీ చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని నేతలకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రామభూపాల్రెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఇసాక్ బాషా, మధుసూదన్తో పాటు వివిధ నియోజకవర్గాల ఇన్ఛార్జులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందని, ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.సమావేశంలో మాట్లాడిన కాటసాని రామభూపాల్రెడ్డి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్ సీపీ అన్ని స్థానాల్లో బలంగా పోటీ చేస్తుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని మరింత పెంచే దిశగా అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని కాటసాని రామభూపాల్రెడ్డి పేర్కొన్నారు. వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు చేశారు. ఇలాంటి అంశాలపై న్యాయపరంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు.సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై కేసులు నమోదు చేయడం సరికాదని ఆయన అన్నారు. ప్రభుత్వ హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించే విధంగా పాలన సాగాలని సూచించారు. అధికార వ్యవస్థను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తుది నిర్ణయం చెబుతారని కాటసాని రామభూపాల్రెడ్డి అన్నారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొని ప్రజల తీర్పును గౌరవించాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న నేతలు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

# విద్యార్థుల సౌకర్యాలకు దాతల చేయూత

**- సాంఘిక సంక్షేమ వసతి గృహానికి 40 మంచాల అందజేత**
**- విద్యాభివృద్ధికి సహకరించిన దాతలకు ఎమ్మెల్యే అభినందనలు**
**- వసతి గృహాల్లో మరింత మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని హామీ**



**నందిగామ, రాజధాని వాయిస్ :** నందిగామ పట్టణంలోని అశోక్నగర్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం దాతల సహకారంతో సమకూర్చిన 40 మంచాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకు లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతి సదుపా యాలు కల్పించే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికం గా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు వస్తున్న దాతల సేవలు ఆదర్శప్రాయ మని అన్నారు. వారి సహకారం వల్ల విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసే అవకాశం లభిస్తోందని తెలిపారు.విద్యార్థులు తమకు అందుతున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కష్టపడి చదివి సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్య మాత్రమే జీవితంలో ఉన్నత స్థితికి చేర్చగలదని, అందుకు అవసరమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించేందుకు కట్టుబడి ఉందని చెప్పారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వసతి, భోజనం, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు.దాతల సహకారంతో అందించిన 40 మంచాలు విద్యార్థుల రోజువారీ జీవనంలో ఉపయోగకరంగా మారనున్నాయని అధికారులు తెలిపా రు. వసతి గృహంలో ఉండే విద్యార్థులకు మెరుగైన విశ్రాంతి, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంలో ఇవి దోహదపడతా యని పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com